క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ


ఆసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలు, రోగులు వారి సహాయకులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్యాపిలి మండలం బావిపల్లెకు చెంది రెడ్డి జనార్దన్ సహాయంతో రొట్టె, గుడ్లు, పప్పు అందజేశారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు


స్టాక్ పాయింట్‌లో పాఠ్యపుస్తకాలు

కొలిమిగుండ్ల : ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందజేసేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలు ఆదివారం మండల కేంద్రానికి చేరాయని ఎంఈఓ రాజయ్య తెలిపారు. ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను నిల్వ చేశామన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 16,467 పుస్తకాలు అవసరం కాగా.. ప్రస్తుతం 4,980 వచ్చాయన్నారు. మిగిలిన పుస్తకాలు త్వరలో మండలానికి చేరుతాయన్నారు. పాఠశాలలు ప్రారంభంలోగా అక్కడికి చేరుస్తామన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు వాసవీ అవార్డ్స్


విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థులకు ఆవోపా సంఘం ఆధ్వర్యంలో వాసవీ అవార్డ్సులను ప్రదానం చేశారు. ఆదివారం స్థానిక అమ్మవారిశాలలో ఆవోపా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మార్కులు పైబడి సాధించిన 17 మందికి వారి తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించి అవార్డులను అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆవోపా డోన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆవోపా రాష్ట్ర కార్యదర్శి శివపురం నాగరాజు, శ్రీకృష్ణదేవరాయ రీజియన్ ఉపాధ్యక్షుడు దుర్గం అంబికేశ్వరశెట్టి ఆధ్వర్యంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో డోన్ ఆవోపా కార్యవర్గ సభ్యుల ఏకాభిప్రాయం మేరకు నూతన అధ్యక్షుడిగా మాకం కృష్ణకిషోర్, కార్యదర్శిగా జొన్నలగడ్డ శ్రీనివాసులు, కోశాధికారిగా శేగు సుదర్శన్‌రావును ఎన్నుకున్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి పివి రంగయ్య, కోశాధికారి చాటకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ ధ్రువ పత్రాల పరిశీలన

బేతంచెర్ల: పాలిటెక్నిక్, డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏపీ పాలిసెట్‌కు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన, ర్యాంకుల వారిగా ఈనెల 27 నుంచి జూన్ 3వ తేదీ వరకు నంద్యాల, కర్నూలు, ఆదోని హెల్ప్‌లైన్ సెంటర్లలో నిర్వహిస్తారని బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ ఆదివారం తెలిపారు. ధ్రువ పత్రాల పరిశీలన తదుపరి ఆపషన్ల నమోదును ఈనెల 31 నుంచి జూన్ 5వ తేదీ వరకు చేసుకోవచ్చని, జూన్ 7వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు పేమెంట్ పత్రం, పాలిసెట్ ర్యాంక్, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ హాల్ టికెట్, మార్క్స్ పత్రం, 2021 జనవరి 1న తీసుకున్న ఆదాయ ధ్రువ పత్రం, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువ పత్రం ఒరిజినల్స్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో వెళ్లాలని సూచించారు. తమ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిబిరంలో గుండె, బీపీ, షుగర్, కంటి, ఊపిరితిత్తులు తదితర వ్యాధులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్స్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి, పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- బంగినపల్లి పేరుతో ఇతర రకాల మామిడి పండ్ల విక్రయాలు
- తక్కువ ధరకు తెచ్చి ఎక్కువకు అమ్మకాలు
- గుర్తించలేక మోసపోతున్న వినియోగదారులు

పండు మార్చి.. ధర పెంచి!



బంగినపల్లె మామిడి పండ్ల పేరుతో దుకాణాల్లో విక్రయానికి ఉంచిన ఇతర ప్రాంతాల మామిడి పండ్లు

బనగానపల్లె: బంగినపల్లి బేనిషాన్ మామిడి పండ్లకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఉన్న విషయం విధితమే. చిన్న పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా ఈ మామిడి పండ్లను అరగిస్తారు. కొనుగోలు సమయంలో అప్పటి పరిస్థితులు, డిమాండ్‌ను బట్టి ధరను లెక్క చేయకుండా శక్తి మేరకు కొనుగోలు చేస్తారు. దీనిని అసరాగా తీసుకొని ఇక్కడి వ్యాపారులు నుజీవీడు, విజయవాడ, చిత్తూరు, యంబాయి, తదితర ప్రాంతాల నుంచి మామిడి పండ్లను తీసుకువచ్చి బంగినపల్లి పేరుతో విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల మామిడి పండ్లను తూకాలతో తక్కువ ధరకు తీసుకువచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నందున వినియోగదారులు మోసపోతున్నారు.

బంగినపల్లి లక్షణాలు..

చూసేందుకు సైజ్ అకారం ఒకటిగా ఉన్నందున గుర్తించలేకపోతున్నారు. బంగినపల్లి బేనిషాన్ మామిడి పండు తోలు పలుచగా ఉండి, విత్తనం వరకు తీయ్యగా ఉంటుంది. మాగిన తరువాత పది రోజుల వరకు చేడిపోదు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన మామిడి పండ్లు తోలు మందంగా ఉండి విత్తనం వద్ద పుల్లగా ఉంటుంది. రెండు మూడు రోజుల్లోనే చేడిపోతుంది.

దిగుబడి తగ్గడంతో..

నకిలీ బంగినపల్లి మామిడి పండ్ల విక్రయాలు బనగానపల్లె పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా వాతావరణం అనుకూలించకపోవడంతో బంగినపల్లి పంట దిగుబడి తక్కువగా ఉంటోంది. దీనికితోడు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుండటంతో స్థానిక వినియోగదారులకు అవసరమైన మేర బేనిషాన్ అందుబాటులో ఉండటం లేదు. దీనిని ఆసరాగా చేసుకొని వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి మామిడి పండ్లను తీసుకువచ్చి బంగినపల్లి బేనిషాన్‌తో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నవాబుల పాలనలో ప్రోత్సాహం..

బనగానపల్లె సంస్థానాన్ని నవాబులు పరిపాలించిన కాలంలో ఈ ప్రాంతంలో మామిడితోటల పెంపకానికి విశేష ప్రాధాన్యత ఇచ్చారు. ఇక్కడి భూములు మామిడి తోటల పెంపకానికి అనువుగా ఉన్నందునే ఎక్కువ విస్తీర్ణంలో మామిడి తోటలను ఏర్పాటు చేశారు. వీటి కోసం ప్రత్యేకంగా బావులను తవ్వించి తోట మాలులను నియమించారు. పండిన మామిడి పంటను ఇతర ప్రాంతాలకు రవాణ చేసి వచ్చిన ఆదాయాన్ని ఖజానాకు తరలించి సంస్థానానికి ఆర్థిక సమస్యలేకుండా అప్పట్లో చర్యలు చేపట్టారు.

తగ్గిన మామిడి సాగు విస్తీర్ణం..

ప్రస్తుతం బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో మామిడి తోట విస్తీర్ణం పూర్తిగా తగ్గింది. నవాబుల పాలన కాలంలో సుమారు 1200 నుంచి 1500 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా నేడు 150-200 ఎకరాలకు తగ్గిపోయాయి. కొత్తతోటల పెంపకం లేకపోవడంతో పాటు పాతతోటలు అంతరించి పోవడమే ఇందుకు కారణం. అందువల్లనే ఇతర ప్రాంతాల నుంచి తీసుకొని వచ్చిన మామిడి పండ్లను బంగినపల్లి పేరుమీద ఇక్కడి వ్యాపారులు విక్రయిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

బనగానపల్లె బేనిషాన్ మామిడి పండ్ల పేరు మీద ఇతర మామిడి పండ్లను విక్రయిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు కూడా ఈ విక్రయాలపై ఫిర్యాదు చేయాలి. వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన మామిడి పండ్లను బంగినపల్లి పేరుతో కాకుండా ప్రత్యేకంగా విక్రయించుకోవచ్చు.

– హరిప్రసాద్, ఈఓ, గ్రామ పంచాయతీ బనగానపల్లె

వైభవంగా చెన్నకేశవుడి రథోత్సవం


ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి

అవుకు: మండల కేంద్రం అవుకులో తిరుకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అవుకు రాజవంశీయులు త్రివిక్రమవర్మ, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఉత్సవ మూర్తులకు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. తేరువీధి నుంచి రాజా వీధి మీదుగా మండపం వీధి వరకు రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు పీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, ఎగ్గోని, గిద్దలూరు, రెడ్డిపల్లె, ఆల్వకొండ, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, కానాల, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ వివరించారు.

డోన్ టౌన్ : డోన్ –బేతంచెర్ల జాతీయ రహదారి –44 బి పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పనుల కారణంగా ఇండస్ట్రీయల్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కన్నపకుంట,వాటర్ వర్క్స్ ఫీడర్ల లైన్ షిప్టింగ్ పనుల కారణంగా బేతంచెర్ల రోడ్డులోని ఫ్యాక్టరీలకు,దర్మారం,కన్నపకుంట గ్రామాలకు మధ్యాహ్నం 12 నుంచి సాయిత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయం కోసం రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

మైసూరమ్మకు బోనాల సమర్పణ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో వెలసిన మహిషాసురమర్దినిదేవి(మైసూరమ్మ)కి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. గ్రామ సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, గ్రామ నాయకులు బాలీశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సనాతన ధర్మాన్ని అలవర్చుకోవాలి


విద్యార్థికి మెమెంటో అందజేస్తున్న డాక్టర్ శివప్రసాద్


విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న పద్మశాలీయ సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు చదువుతో పాటు సనాతన ధర్మాన్ని అలవర్చుకోవాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ కార్తీక పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైటిపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో మనఊరు, మన గుడి–మనబాధ్యత ఆధ్వర్యంలో ఇటీవల పదవ తరగతి ఉత్తీర్ణులైన 120మంది విద్యార్థులకు వేద ఆశీర్వచనంతో పాటు నోట్ పుస్తకాలు అందజేశారు. నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి, డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో..

ఇటీవల పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన పద్మశాలీయ విద్యార్థులకు ఆదివారం శ్రీ భద్రతావతి భావనారుషి దేవాలయ కల్యాణ మండపంలో ప్రతిభకు పట్టాభిషేకం అనే కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 85మంది పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వరుసగా రూ.10వేలు, రూ.7500, రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతి కింద ప్రతి ఒక్కరికీ రూ.2వేలు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశామని చెప్పారు. లక్ష్మీనారాయణ, గాజుల శంకర్, వేణు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బ్రహ్మానందం , వెంకటరామయ్య, కౌన్సిలర్ పురందర్ పాల్గొన్నారు.

విద్యతో పాటు కళలను ప్రోత్సహించాలి


విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

నంద్యాల(వ్యవసాయం): తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు కళలు, లలిత కళలు, క్రీడల పైన దృష్టి సారించి వారి అభివృద్ధికి తోడ్పడాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాసాధన 2024 ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళారాధన సంస్థ 23 సంవత్సరాలుగా లయన్స్‌క్లబ్, ఐఎంఏ, రోటరీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ముగింపు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. పిల్లల నైపుణ్యాలను వెలికి తీయడానికి నెల రోజులుగా వారికి నేర్పించడం ఎంతో సాహసోపేతమైందన్నారు. రిటైర్డు జిల్లా విద్యాశాఖ అధికారి గుర్రాల రామకృష్ణయ్య వార్షిక పురస్కారాలను అందజేశారు. బాలరత్న ప్రతిభా పురస్కారం, సరయూ, యువరత్నా ప్రతిభా పురస్కారాలు అందజేసి సత్కరించారు. అనంతరం విద్యార్థుల శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం, ఆధునిక నృత్యం, సినీ లలిత గానాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే నెల పాటు శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు. కళారాధన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధుసూదన రావు, డాక్టర్ రవికృష్ణ, శివకుమార్‌నాయుడు, రంగనాథ్, చంద్రమోహన్, తదితర లయన్స్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మృతదేహానికి అంత్యక్రియలు

డోన్: స్థానిక రైల్వేస్టేషన్ రెండవ ప్లాట్‌ఫారం వద్ద రైలు కింద పడి రెండు రోజుల క్రితం మృతిచెందిన గుర్తుతెలియని 40 ఏళ్ల వ్యక్తికి ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. రెండురోజుల నుంచి ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినా మృతుడి ఆనవాళ్లు తెలియకపోవడంతో స్థానిక జీఆర్‌పీ, పోలీసులు..అంత్యక్రియలు నిర్వహించాల్సిందిగా ఆత్మబంధువు సభ్యులనుకోరారు. దీంతో స్థానిక హిందూ స్మశానవాటికలో సభ్యులు రాజు, గురుస్వామి, మద్దిలేటి, పోలీసులు మధు, సుధాకర్, నరసింహులు అంత్యక్రియలు నిర్వహించారు.


బూరుగలలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు,


బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌ల్లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి

విజయోత్సవ ర్యాలీలు నిషేధం


నందివర్గం పోలీసు స్టేషన్‌లో పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ తిమ్మారెడ్డి

ప్యాపిలి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం గెలిచిన నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకోవడం, విజయోత్సవ ర్యాలీలు చేయడం నిషేధమని సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని బూరుగల గ్రామంలో ఆదివారం సీఐ ఆధ్వర్యంలో రాచర్ల ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఎవరూ వెళ్లరాదని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు

ప్యాపిలి: అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జలదుర్గం ఎస్ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని జలదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున రౌడీషీటర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. తమపై బైండోవర్ నమోదైన విషయాన్ని రౌడీషీటర్లు గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు కౌంటింగ్ కేంద్రాల వద్దకు వెళ్లకూడదన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం రెచ్చగొట్టుకునేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బేతంచెర్ల : జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెలువడనున్న నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, ఊరేగింపులు నిషేధించినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో రౌడీ షీటర్లకు సీఐ ప్రియతం రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరైన పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రుద్రవరం గ్రామంలో శనివారం జరిగిన బాణాల హరిప్రసాద్ హత్య నేపథ్యంలో గ్రామాన్ని సందర్శించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఐని ఆదేశించారు. గ్రామస్తులు సంయమనం పాటించాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్టు అమలు

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకూ జిల్లా వ్యాప్తంగా పోలీసు 30 యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో ఉన్న నిందితులకు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పాతనేరస్తులు, రౌడీషీటర్లు బయటికి రాకూడదని సూచించారు. ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచినా విజయోత్సవ సంబరాలు, బాణాసంచా పేల్చేందుకు అనుమతిలేదన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించినా, గొడవలను ప్రోత్సాహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


రుద్రవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలుబడనున్న నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. మండలకేంద్రంలో ఆదివారం సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ బలగాలతో కార్డెన్ సెర్చ్ చేపట్టి అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిశాల సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలుబడున్నాయని, గ్రామాల నుంచి లెక్కింపు కేంద్రాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. 144 సెక్షన్, 30యాక్ట్ అమలులో ఉందని, ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. ఫలితాలు వెలువడగానే విజయోత్సవాలు చేసుకోరాదని, అందరూ శాంతియుతంగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో అనుమానిమాత వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేని 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐలు చంద్రబాబు, హనుమంతు నాయక్, ఎస్ఐలు నిరంజన్‌రెడ్డి, సురేష్, రామాంజనేయరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

పంట మార్పిడితో ప్రయోజనం

- ఒకేరకమైన పంట సాగుతో నష్టం
- వేర్వేరు పంటలతో రైతులకు, పొలాలకు లాభదాయకం
- చీడపీడల నుంచి రక్షణ


కేసీ కెనాల్ కింద పచ్చిరొట్ట సాగు చేసిన దృశ్యం (ఫైల్)

గోస్పాడు: ఈఏడాది ముందస్తుగా వర్షాలు పడుతుండటంతో పాటు ఖరీఫ్ సీజన్‌కు సమయం ఆసన్నం కావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే మండలంలో చాలా మంది రైతులు ఏటా ఒకే రకమైన పంట సాగు చేస్తున్నారు. దీంతో భూ సారం తగ్గి పెట్టుబడులు పెరగడంతోపాటు దిగబడులు ఏటేటా పడిపోతున్నాయి. ఏటా ఒకే రకం పంటలను సాగు చేయకుండా వేర్వేరు పైర్లను ఒక క్రమంలో వేసేలా దృష్టిసారించాలని ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.


యాళ్లూరు వద్ద పొలంలో సేద్యం చేస్తున్న రైతు

పైర్ల మార్పిడి తో రైతులకు ప్రయోజనం

రైతులు ప్రతిఏడాది ఒకేరకమైన పైర్లను సాగుచేయకుండా పైర్ల మార్పిడి పద్ధతిని అనుసరించాలి. ఒకసారి వేసిన పైరు తిరిగి వేయడం వల్ల పొలాల్లో భూసారం తగ్గే అవకాశం ఉంది. పంటమార్పిడిపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. పచ్చిరొట్టపైర్ల సాగుతో కూడా భూసారం పెరుగుతుంది. వీటికోసం రైతులకు సబ్సిడీ కింద జీలుగలు అందిస్తున్నాం.

–స్వప్నికారెడ్డి, ఏఓ, గోస్పాడు

ఇలా సాగు చేద్దాం..

- మొక్కజొన్న వేసిన పొలంలో మిరప పంట సాగు చేయకుండా ఉంటే మంచిది. ఒకవేళ మిరప పంట సాగుచేస్తే నష్టం తప్ప లాభాలు వచ్చే అవకాశం లేదు. పత్తి వేసిన పొలంలో మిరప పంట సాగుచేస్తే లాభసాటిగా ఉంటుంది.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలు, నూనెగింజల పంటలను సాగుచేయడం ద్వారా వరికి తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి.
- మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశాలు ఎక్కువ . మిరప పంట సాగుచేయడానికి ముందు భూమిలో జొన్న, పిల్లిపెసర వంటి పంటను సాగుచేసి దాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి పంట సాగుచేస్తే భూసారం పెరిగి చీడపీడలు దరిచేరవు.
- నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి.
- వేరుశనగ, పెసర, మినుము పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా ఉంటాయి.
- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలను సాగుచేసుకోవచ్చు.